# విశాల భారతి

తెలుగు దినపత్రిక

11-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్

సంపుటి:4 సంచిక: 100


## ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు



- ఆర్టీసీ ఉద్యోగులకు 2.1శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- డీఏ 50.7శాతం నుంచి 52.8 శాతానికి పెరిగింది
- ఈ నిర్ణయంతో 38 వేల మంది సిబ్బందికి ప్రయోజనం
- 2026 జనవరి నుంచే పెంపు అమల్లోకి వస్తుంది
- సంస్థపై నెలకు రూ.2.82 కోట్ల అదనపు భారం
- మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ రూ.954 కోట్ల లాభం ఆర్జించింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది కార్మికులు, అధికారులకు రాష్ట్ర సర్కారు తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా

మిగతా 4లో..

## ప్రభుత్వానికి పొంగులేటి డ్యామేజ్..!

- రేవంత్ కంటే ఎక్కువగా పొంగులేటిపైనే బీఆర్ఎస్ దాడులు
- నాదర్‌గుల్ భూముల మ్యూటేషన్లపై క్విడ్ ప్రో కో ఆరోపణలు
- పాత సెటిల్‌మెంట్ల చిట్టా బయటపడుతుందన్న గులాబీ నేతల భయం
- పొంగులేటి కంపెనీ పనులపై కేటీఆర్, హరీష్ విమర్శలు
- కేటీఆర్-మేఘా కృష్ణారెడ్డి సంబంధాలపై పొంగులేటి వ్యాఖ్యల రచ్చ
- మంత్రిపై ఆరోపణలు వస్తున్నా రేవంత్ స్పందించకపోవడంపై చర్చ

02











తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ద్వయం ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న దాడులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టాల్సిన ప్రతిపక్ష నేతలు, అంతకంటే మిన్నగా ఒక మంత్రిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వెనుక లోతైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇది కేవలం సిద్ధాంత పరమైన విభేదం మాత్రమే కాదని, గత పదేళ్ల పాలనలో జరిగిన కొన్ని చీకటి ఒప్పందాలు, సెటిల్‌మెంట్ల కోణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు రేవంత్ రెడ్డి సర్కార్‌కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతున్నా, ప్రభుత్వం మాత్రం స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.



### గడ్డపోతారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

- సాల్వెంట్ పేలుడు.. భారీ మంటలు
- రెండు గంటలుగా ఫైర్ ఫైట్
- దట్టమైన పొగ.. భయాందోళన
- ప్రాణనష్టం లేదు, నష్టం భారీ

02

## అన్నా..దేవుడే పంపించాడన్నా!

- 40 ఏళ్ల అనుబంధానికి ముగింపు
- కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరిక
- కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు
- తెలంగాణ మేలు కోసమే ఈ నిర్ణయం
- ఎర్రవల్లిలో కేటీఆర్, నేతల సాదర ఆహ్వానం
- ఇన్నాళ్లకు కేసీఆర్‌తో కలవడంపై హర్షం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. దశాబ్దాల పాటు హస్తం పార్టీకి వెన్నెముకలా నిలిచిన సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తన రాజకీయ ప్రయాణంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీకి వీడ్కోలు పలికిన ఆయన గులాబీ గూటికి చేరారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ఈ సీనియర్ నాయకుడి నిర్ణయం పట్ల అటు రాజకీయ వర్గాల్లో, ఇటు ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

మిగతా 5లో..

## కేటీఆర్ బెస్ట్ కమెడియన్

- సీనియర్ల గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం
- నియోజకవర్గాల పెంపులో రాజకీయ స్వార్థం వద్దు
- ఉన్న సీట్లలోనే మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వొచ్చు
- దక్షిణాదిని రెండో తరగతి పౌరుల్లా చూడొద్దని హెచ్చరిక
- రూపాయి ఇస్తే 42 పైసలే రావడంపై ఆగ్రహం వ్యక్తం
- అన్యాయం జరిగితే కేంద్ర బిల్లును అడ్డుకుంటామని స్పష్టం





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర, దేశ రాజకీయ అంశాలపై అత్యంత ఘాటుగా స్పందించారు. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న విధానాలను, భారత రాష్ట్ర సమితి నేతల ద్వంద్వ వైఖరిని ఆయన ఎండగట్టారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, ఆర్థిక వనరుల పంపిణీ వంటి కీలక విషయాల్లో కేంద్ర ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అవసరమైతే పార్లమెంటు వేదికగా పోరాడతామని హెచ్చరించారు. అగ్రనేతల వైఖరి వల్ల దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా, ఆర్థికంగా అణచివేతకు గురవుతున్నాయన్న వాదనను ఆయన గట్టిగా వినిపించారు. శాసనసభ నియోజకవర్గాల పెంపు అంశంపై

మిగతా 3లో..





## ప్రభుత్వానికి వేతన వేదన

- నెలకు జీతాల ఖర్చు రూ. 6 వేల కోట్లకు చేరింది
- రాష్ట్ర ఆదాయంలో సగం జీతాలకే సరిపోతోంది
- 40 వేల మంది దొంగ ఉద్యోగులను గుర్తించారు
- కొత్తగా 27 వేల జీపీఎఫ్ ఖాతాలు పెరిగాయి
- ఔట్‌సోర్సింగ్ వివరాల కోసం కొత్త వెబ్‌సైట్
- నియామకాల్లో అధికారులనే జవాబుదారీ చేశారు

03

## ముగిసిన దశాబ్దాల పోరాటం!

- 42 మంది మావోయిస్టులు లొంగుబాటు
- తెలంగాణ స్టేట్ కమిటీ పూర్తిగా నిర్వీర్యం
- ఏకే-47లు, బంగారం పోలీసుల పరం
- ప్రభుత్వం రూ.1.93 కోట్లు విడుదల చేసింది
- అందరికీ ఉచిత హెల్త్ కార్డుల పంపిణీ
- నాయకత్వం లేక సంస్థ కుప్పకూలింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సరిహద్దు అడవుల్లో తుపాకీ గొట్టం నిశ్శబ్దమైంది. దశాబ్దాల కాలంగా ఎర్రజెండా నీడన సాగిన సాయుధ పోరాటం ఇప్పుడు చరమాంకానికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. శుక్రవారం నాడు చోటుచేసుకున్న అనూహ్య పరిణామం మావోయిస్టు పార్టీ పునాదులను కదిలించివేసింది. ఏకంగా 42 మంది మావోయిస్టులు ఒకేసారి పోలీసు యంత్రాంగం ముందు మోకరిల్లడం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక మలుపుగా మారింది. లొంగిపోయిన వారిలో అత్యంత కీలకమైన బెటాలియన్ కమాండర్‌తో పాటు మూడు ప్రధాన విభాగాలకు చెందిన సీనియర్ నేతలు ఉండటం గమనార్హం. ఈ పరిణామాన్ని కేవలం సాధారణ లొంగుబాటుగా కాకుండా మావోయిస్టు "సంస్థ నిర్మాణం పూర్తిగా కుప్పకూలిన దశ"గా పోలీస్ ఉన్నతాధికారులు అభివర్ణిస్తున్నారు. విప్లవ పంథాలో కొనసాగుతున్న కేడర్ ఆలోచనా ధోరణిలో వచ్చిన పెను మార్పుకు

మిగతా 3లో..

### జీవన్ రెడ్డి బాటలో ధర్మపురి

- జీవన్ రెడ్డి బాటలోనే కాంగ్రెస్‌ను వీడేందుకు ధర్మపురి సంజయ్ సిద్ధం
- పార్టీలో గుర్తింపు, సరైన గౌరవం దక్కడం లేదని తీవ్ర అసంతృప్తి
- ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదని, పదవుల్లోనూ మొండిచేయి చూపారని ఆగ్రహం
- తన రాజకీయ ఎదుగుదలను ఓ కీలక నేత అడ్డుకుంటున్నారని ఆవేదన
- సీనియర్ డీఎస్ కుటుంబానికి పార్టీలో ప్రాధాన్యత లేదని మండిపాటు
- త్వరలోనే అనుచరులతో భేటీ అయ్యి అధికారికంగా గుడ్ బై చెప్పే యోచన

02

## ఈ నెల 12న ఇంటర్ ఫలితాలు

- సీఎం రేవంత్ రెడ్డి ఫలితాలను రిలీజ్ చేయనున్నారు
- ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఒకేసారి వస్తాయి
- దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు
- అధికారిక వెబ్‌సైట్‌లో రిజల్ట్స్ చూసుకోవచ్చు
- ఫలితాల కోసం హాల్ టికెట్ నంబర్ తప్పనిసరి

02





## మగ్గం మూగబోయె..!





- ప్రభుత్వ ఆర్డర్లు రాక మగ్గాలు ఆగిపోయాయి
- ఓపెన్ టెండర్ల వల్ల నేతన్నలకు అన్యాయం
- జీవో నం.1 నిబంధనలను ప్రభుత్వం పక్కన పెట్టింది
- స్థానికులను కాదని ప్రైవేటు సంస్థలకు పని ఇస్తున్నారు
- ఉపాధి కరువై నేతన్నలు మళ్లీ వలస వెళ్తున్నారు
- బతుకుదెరువు చూపకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు

02

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్వయంపాలనలో వెలుగులు చూస్తామనుకున్న చేనేత, పవర్‌లూమ్ కార్మికుల జీవితాలు నేడు చీకటిమయమవుతున్నాయి. తరతరాలుగా మగ్గాన్నే నమ్ముకుని జీవిస్తున్న వేలాది కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయాల వల్ల రోడ్డున పడే పరిస్థితి తలెత్తింది. ఒకప్పుడు నిరంతర ఆర్డర్లతో కళకళలాడిన సిరిసిల్ల సాంచాలు, వరంగల్ మగ్గాలు నేడు మూగబోయి కనిపిస్తున్నాయి.

# ఈ నెల 12న ఇంటర్ ఫలితాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉత్కంఠకు తెరపడనుంది. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక ప్రకటన చేస్తూ ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారు చేసింది. ఏప్రిల్ 12వ తేదీన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఒకేసారి వెల్లడించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యాశాఖ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ఫలితాలను విడుదల చేస్తారని సమాచారం అందడంతో అటు విద్యార్థి లోకంలో, ఇటు విద్యా వర్గాల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. వేసవి తాపం పెరుగుతున్న వేళ, ఫలితాల వేడి కూడా తోడవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పరీక్షలు ముగిసిన నాటి నుంచి వెయిటింగ్ లిస్టులో ఉన్న విద్యార్థులకు ఈ వార్త ఊరటనిస్తోంది. మార్కుల వేటలో ఎవరు పైచేయి సాధిస్తారో అన్న ఆత్రుత ప్రతి ఇంట్లో కనిపిస్తోంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను వేగంగా తెలుసుకునే సౌకర్యం కల్పించారు. హాల్ టికెట్ నంబర్ సిద్ధంగా ఉంచుకుంటే చాలు, ఇంటర్నెట్ సాయంతో క్షణాల్లో మార్కుల జాబితాను పొందే వీలుంది. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా సర్వర్లను పటిష్టం చేసినట్లు బోర్డు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఫలితాల వెల్లడి తర్వాత వెబ్‌సైట్‌లో ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సిద్ధం చేశారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు హాజరైన గణాంకాలు పరిశీలిస్తే అక్షరాలా 9,97,075 మంది విద్యార్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. దాదాపు పది లక్షల మంది భవిష్యత్తు ఈ ఫలితాలతో ముడిపడి ఉంది. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,89,126 మంది ఉండగా, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లారు. ప్రతి ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ఇంటర్ విద్యా ప్రాధాన్యతను చాటి చెబుతోంది. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే




ఇంటర్ మార్కులు కీలకమని భావించే విద్యార్థులు, ఫలితాల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. లింగ విభజన వారీగా చూస్తే అమ్మాయిలు, అబ్బాయిల మధ్య గట్టి పోటీ నెలకొంది. ప్రథమ సంవత్సరంలో 2.17 లక్షల మంది బాలురు పరీక్ష రాయగా, 2.24 లక్షల మంది బాలికలు తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమయ్యారు. బాలికల సంఖ్య అబ్బాయిల కంటే కాస్త ఎక్కువగా ఉండటం గమనార్హం. గత కొన్నేళ్లుగా ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధిస్తుండటంతో ఈసారి కూడా అదే జోరు కొనసాగుతుందా లేక అబ్బాయిలు పుంజుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది. ప్రతి విద్యా సంవత్సరంలో ఈ గణాంకాలు మారుతున్నప్పటికీ, పోటీ తత్వం మాత్రం విద్యార్థులందరిలోనూ సమానంగా కనిపిస్తోంది. వృత్తి విద్యా కోర్సుల వైపు మొగ్గు చూపుతున్న వారి సంఖ్య కూడా ఆశాజనకంగానే ఉంది. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఫస్టియర్ విద్యార్థుల్లో 22,586 మంది బాలురు, 24,675 మంది బాలికలు పరీక్షలకు హాజరయ్యారు. చదువుతో పాటు ఉపాధి అవకాశాలు లభించే ఈ కోర్సులపై విద్యార్థుల్లో అవగాహన పెరుగుతోంది. సాధారణ గ్రూపులతో పోలిస్తే వీటిలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, సాంకేతిక నైపుణ్యాల పట్ల ఆసక్తి ఉన్నవారు ఈ బాటను ఎంచుకుంటున్నారు. ఫలితాల వెల్లడి తర్వాత వీరికి ఉన్నత విద్య లేదా ఉద్యోగ అవకాశాల దిశగా అడుగులు వేయడానికి మార్గం సుగమం కానుంది.

ద్వితీయ సంవత్సర విద్యార్థుల గణాంకాలను గమనిస్తే 2.31 లక్షల మంది బాలురు, 2.30 లక్షల మంది బాలికలు ఉన్నారు. ఇక్కడ బాలురు, బాలికల సంఖ్య దాదాపు సమానంగా ఉండటం విశేషం. సెకండియర్ విద్యార్థులకు ఈ ఫలితాలు అత్యంత కీలకం. ఉన్నత విద్యకు సంబంధించిన ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కుల వెయిటేజీ కూడా ప్రభావం చూపుతుంది. అందుకే ప్రతి మార్కు విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం, బోర్డు తీసుకున్న చర్యలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయో వేచి చూడాలి. ఫిబ్రవరి 25న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు మార్చి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగాయి. మొత్తం 1495 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తమ రాతపూర్వక పరీక్షలను పూర్తి చేశారు. నిరంతర నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగిన ఈ ప్రక్రియలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, గడువులోగా ఫలితాలను అందించాలన్న లక్ష్యంతో ఇంటర్ బోర్డు పని చేసింది. అనుకున్నట్లుగానే ఏప్రిల్ రెండో వారంలోనే ఫలితాలు వెలువడటం విశేషం. ఫలితాల విడుదల సందర్భంగా విద్యార్థుల్లో సహజంగానే ఒత్తిడి ఉంటుంది. అయితే మార్కులు కేవలం జీవితంలో ఒక భాగమేనని, అవే సర్వస్వం కాదని నిపుణులు సూచిస్తున్నారు. విఫలమైన విద్యార్థులకు మళ్ళీ అవకాశం ఉంటుందని, ఆత్మస్థైర్యం కోల్పోవద్దని విద్యావేత్తలు కోరుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురాకుండా వారిని ప్రోత్సహించాల్సిన సమయం ఇది. ఫలితాలు ఎలా ఉన్నా ధైర్యంగా స్వీకరించి, ముందడుగు వేయడమే అసలైన గెలుపు అని వారు వివరిస్తున్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫలితాలను విడుదల చేస్తుండటంతో ఈసారి ప్రకటనకు మరింత ప్రాధాన్యత లభించింది. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న తరుణంలో, ఇంటర్ ఫలితాల నిర్వహణను ఒక సవాలుగా తీసుకున్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా మార్కుల జాబితాను సిద్ధం చేశారు. విద్యార్థులు తమ గ్రేడ్లు, మార్కులను చూసుకున్న తర్వాత ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ సౌకర్యాలను కూడా బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది. పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల విడుదల వరకు ప్రతి దశలోనూ ఇంటర్ బోర్డు అధికారులు ఎంతో శ్రమించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలమంది ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొని, అత్యంత వేగంగా ఫలితాల క్రోడీకరణ పూర్తి చేశారు. సాంకేతిక నిపుణుల బృందం వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యతలను తీసుకుని, ఫలితాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తోంది. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్లతో పాటు పుట్టిన తేదీ వివరాలను కూడా దగ్గర ఉంచుకోవడం మంచిది. పన్నెండో తేదీన వెలువడే ఈ ఫలితాలు ఎంతో మంది కలలను నిజం చేయనున్నాయి.

## నాదర్గుల్ సర్కారు భూములపై 'కాంగ్రెస్' కన్ను!

- 373 ఎకరాల కబ్జాపై బీఆర్ఎస్ సమరభేరి
- అడిషనల్ కలెక్టర్‌కు స్థానిక మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు
- రైతులను బౌన్సర్లతో బెదిరిస్తున్నారంటూ ఆగ్రహం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట పరిధిలోని నాదర్గుల్‌లో గల 373 ఎకరాల ప్రభుత్వ భూములపై అధికార కాంగ్రెస్ పార్టీ నేతల కన్ను పడిందని, యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు కదిలారు. శుక్రవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల బృందం అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

**బౌన్సర్లతో భూదందానా?**

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. సర్వే నంబర్ 673లో సుమారు 600 మంది రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను కొందరు కాంగ్రెస్ నేతలు బౌన్సర్లు, గుండాలను ఉపయోగించి ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ సీలింగ్ చట్టానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు.అధికారుల మౌనం.. నేతల ఆగ్రహం స్థానిక ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, వాణిదేవి ప్రశ్నించారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి, బాధ్యులైన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**భారీగా తరలిన నేతలు**

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, జిల్లా పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, పట్నం నరేందర్ రెడ్డి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే బాధితుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

"కోర్టు పరిధిలో ఉన్న భూముల్లోకి చొరబడి, రైతుల బోర్లను పగలగొట్టి, రేకులతో బారికేడ్లు కట్టి రైతులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది."

మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

## ప్రభుత్వానికి 'పొంగులేటి' డ్యామేజ్..!






**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు నాదర్‌గుల్ భూముల వ్యవహారం. రంగారెడ్డి జిల్లాలోని నాదర్‌గుల్ సర్వే నంబర్ 118లో సుమారు 450 ఎకరాల భూమికి సంబంధించిన వివాదం ఇప్పుడు రాజకీయ రణరంగానికి కేంద్రబిందువైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆ పార్టీలో చేరిన తరుణంలోనే ఈ భూముల మ్యూటేషన్లు అత్యంత వేగంగా జరగడం వెనుక 'క్విడ్ ప్రో కో' ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆనాడు అధికారంలో ఉన్న గులాబీ నేతల అండదండలతోనే వేల కోట్ల విలువైన ఈ ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల పరం చేశారని, ఇప్పుడు అదే అంశాన్ని అస్త్రంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు పొంగులేటిపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఆనాడు మ్యూటేషన్లు చేసింది తమ ప్రభుత్వమే అయినప్పటికీ, ఇప్పుడు ఆ పాపాన్ని పొంగులేటి ఖాతాలో వేయడం ద్వారా తమపై వస్తున్న అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకోవాలని కేటీఆర్, హరీష్ రావు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన రాఘవ కన్స్ట్రక్షన్స్ వ్యవహారం కూడా ఈ రచ్చను పతాక స్థాయికి చేర్చింది. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు ఈ సంస్థ చేపట్టిన కాంట్రాక్టులు, వచ్చిన లాభాలు, వాటి వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలపై బీఆర్ఎస్ నేతలు లెక్కలు తీస్తున్నారు. వేల కోట్ల రూపాయల టెండర్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతోనే ఈ ప్రాజెక్టులు దక్కించుకున్నారని గులాబీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. ముఖ్యంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పనుల్లో రాఘవ కన్స్ట్రక్షన్స్ పాత్రపై గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఆరోపణలు వస్తుండటం గమనార్హం. గతంలో తమతో కలిసి ఉన్నప్పుడు ఏమీ అనని వారు, ఇప్పుడు పొంగులేటి తమ గుట్టుమట్లు రేవంత్ రెడ్డికి చేరవేస్తున్నారనే కంగారుతోనే ఇలాంటి వ్యక్తిగత దాడులకు దిగుతున్నారనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. మేఘా ఇంజనీరింగ్ గ్రూపుతో కేటీఆర్‌కు ఉన్న సంబంధాల గురించి పొంగులేటి హింట్స్ ఇవ్వడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద ప్రాజెక్టుల్లో మేఘా సంస్థ పాత్ర, ఆ సంస్థకు కేటీఆర్‌కు మధ్య ఉన్న సాన్నిహిత్యంపై పొంగులేటి తన వద్ద ఉన్న 'పాత పద్దుల చిట్టా'ను బయటపెడతారేమో అన్న భయం బీఆర్ఎస్ అగ్ర నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. తాను బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో ఏ ఏ సెటిల్‌మెంట్లు ఎక్కడ జరిగాయో, ఎవరికి ఎంత వాటా వెళ్లిందో తనకు తెలుసని పొంగులేటి పరోక్షంగా హెచ్చరిస్తుండటం కేటీఆర్, హరీష్ రావులకు నిద్ర పట్టకుండా చేస్తోంది. అందుకే పొంగులేటిని రాజకీయంగా దెబ్బతీయడం ద్వారా ఆయన నోరు మూయించాలని వారు పావులు కదుపుతున్నారు. ఈ బిజినెస్ వార్ కాస్తా ఇప్పుడు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుకోవడం తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక దురదృష్టకర పరిణామంగా మిగిలిపోనుంది. విపక్షాలు ఇంతలా విరుచుకుపడుతున్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరుడిపై వస్తున్న ఆరోపణలకు సరైన సమాధానాలు ఇవ్వకపోవడం గమనార్హం. ప్రభుత్వం తరఫున ఒక స్పష్టమైన క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కావడం ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. నాదర్‌గుల్ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి నిజానిజాలు తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా, ఎందుకో వెనకడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి మౌనం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రభుత్వమే దోషులను కాపాడే ప్రయత్నం చేస్తోందా లేక ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగించి బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టాలని చూస్తోందా అన్నది తేలాల్సి ఉంది. గతంలో తమకు అత్యంత సన్నిహితంగా ఉండి, పార్టీ కోసం ఆర్థిక వనరులు సమకూర్చిన వ్యక్తే ఇప్పుడు తమ బలహీనతలను ఎత్తిచూపుతుండటం బీఆర్ఎస్ నేతలకు మింగుడుపడటం లేదు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా రాజకీయాల్లోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా బలమైన నేతగా ఎదగడం, ఆయన దగ్గర ఉన్న పాత ఫైళ్లు ఇప్పుడు తమ మెడకు చుట్టుకుంటాయనే ఆందోళన కేటీఆర్, హరీష్ రావుల ప్రసంగాల్లో కనిపిస్తోంది. అందుకే వారు ప్రజా సమస్యల కంటే పొంగులేటి ఆస్తులు, వ్యాపారాల పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ప్రతిపక్షం చేయాల్సిన పనిని విస్మరించి, కేవలం వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారు తమ నైతికతను కోల్పోతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నాదర్‌గుల్ భూములకు సంబంధించి 20142023 మధ్య కాలంలో జరిగిన లావాదేవీల గణాంకాలను పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. ఒకే సర్వే నంబర్‌లో ఉన్న వేల కోట్ల విలువైన భూమి ప్రైవేట్ డెవలపర్ల చేతికి ఎలా వెళ్లిందనే దానిపై ఇప్పుడు విచారణ జరపాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. అప్పట్లో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాల్లో ఈ భూములే ప్రధానమైనవని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. కానీ నేటి ప్రభుత్వం ఈ ఫైళ్లను బయటకు తీయకుండా నాన్చుతుండటం వెనుక రాజకీయ లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా అనే సందేహాలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి సర్కార్ లోపల ఒకలా, బయట మరోలా వ్యవహరిస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్న విమర్శలు బలంగా ఉన్నాయి.

రాఘవ కన్స్ట్రక్షన్స్ గత ఐదేళ్లలో పొందిన కాంట్రాక్టుల విలువ దాదాపు 10,000 కోట్ల రూపాయలకు పైమాటేనని అంచనా. ఇందులో ఎంతమేర అవినీతి జరిగింది, ప్రభుత్వ పెద్దలకు అందిన ముడుపులు ఎంత అనే దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. కానీ మంత్రి పొంగులేటి మాత్రం తన వ్యాపారాలన్నీ పారదర్శకమని, కావాలనే తనపై బురద జల్లుతున్నారని కొట్టిపారేస్తున్నారు. అయితే, అధికారంలో ఉన్నప్పుడు వ్యాపారాలు చేయడం, ఆ వ్యాపారాలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుకోవడం నైతికంగా తప్పని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంలో పొంగులేటిని వెనకేసుకొస్తున్న ప్రభుత్వం, ఆఖరికి ప్రజలకు జవాబుదారీగా ఉండటంలో విఫలమవుతోంది. రాష్ట్రంలో ప్రజా సమస్యలు గాలికి వదిలేసి, నేతలు తమ ఆస్తులను కాపాడుకోవడానికి, ప్రత్యర్థుల వ్యాపారాలను దెబ్బతీయడానికి అసెంబ్లీని, మీడియాను వాడుకోవడం విచారకరం. హరీష్ రావు, కేటీఆర్ ద్వయం పొంగులేటిని టార్గెట్ చేయడం వెనుక ఉన్న 'పాత కోపం' ఏమిటో ప్రజలకు అర్థమవుతోంది. వారేమో 'నువ్వు దొంగ' అంటే, పొంగులేటి 'మీరే అసలైన దొంగలు' అంటూ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అసలు అవినీతి ఎక్కడ జరిగిందో తేలడం లేదు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలా వీధి పోరాటాలకు దిగడం తెలంగాణ రాజకీయాల స్థాయిని దిగజార్చుతోంది. ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ వివాదాన్ని ఒక డైవర్షన్ టాక్టిక్‌గా వాడుకుంటోందన్న వాదన కూడా ఉంది. నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటి కీలక హామీల అమలులో వెనకబడిన రేవంత్ రెడ్డి సర్కార్, ఇలాంటి వివాదాలను ప్రోత్సహించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తోంది. ఒకవేళ నిజంగానే పొంగులేటి అవినీతికి పాల్పడి ఉంటే, ఆయనపై చర్యలు తీసుకోవడానికి రేవంత్ రెడ్డికి అడ్డేమిటి? తన మంత్రివర్గంలోనే ఉన్న వ్యక్తిపై ఆరోపణలు వస్తున్నప్పుడు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై లేదా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు.

## జీవన్ రెడ్డి బాటలో ధర్మపురి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుల అసంతృప్తి జ్వాలలు ఇప్పుడప్పుడే చల్లారేలా కనిపించడం లేదు. పార్టీని దశాబ్దాలుగా నమ్ముకున్న విధేయులు, సీనియర్ నేతల వారసులు ఒక్కొక్కరుగా పక్కకు తప్పుకుంటున్న వైనం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా నిజామాబాద్ జిల్లాకు చెందిన కీలక నేత, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్నా తగిన గుర్తింపు లభించడం లేదని, ప్రాధాన్యం ఇవ్వకుండా నట్టేట ముంచుతున్నారని ఆయన తన అనుచరుల వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాజీనామా నిర్ణయంతో కుదేలైన కాంగ్రెస్‌కు, సంజయ్ రూపంలో మరో గట్టి షాక్ తగిలేలా కనిపిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి రెండుసార్లు వరుసగా అధికారాన్ని కట్టబెట్టిన ఘనత పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్‌కు దక్కుతుంది. అప్పట్లో ఆయన వ్యూహకర్తగా వ్యవహరిస్తూ పార్టీని విజయపథంలో నడిపించారు. అటువంటి రాజకీయ దిగ్గజం అడుగుజాడల్లోనే సంజయ్ తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. తన తండ్రి డీఎస్‌తో పాటే కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తూ, నిజామాబాద్ నగర రాజకీయాల్లో బలమైన ముద్ర వేశారు. నిజామాబాద్ కార్పొరేషన్‌కు తొలి మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. విద్యావేత్తగా శాంకరీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ద్వారా వేలాది మందికి చేరువైన సంజయ్‌కు జిల్లావ్యాప్తంగా సొంత కేడర్ ఉంది. రాజకీయ పరిణామాల నేపథ్యంలో గతంలో డీఎస్‌తో పాటే టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరిన సంజయ్, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశించినప్పటికీ, పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయనకు అవకాశం ఇవ్వలేదు. అయినా నిరాశ చెందకుండా పార్టీ గెలుపు కోసం జిల్లావ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని సుమారు 60 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం తన వంతు కృషి చేశారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలు గట్టి పోటీ ఇచ్చిన చోట్ల సంజయ్ తన రాజకీయ చతురతతో కాంగ్రెస్ జెండా ఎగిరేలా చేశారు. ఇంత చేసినా తనను కేవలం వాడుకుని వదిలేస్తున్నారనే భావన ఆయనలో బలంగా నాటుకుపోయింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు నేతలకు ఇప్పటికే వివిధ కార్పొరేషన్ పదవులు దక్కాయి. జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, కుటుంబ నేపథ్యం, అన్నింటికీ మించి మేయర్‌గా చేసిన అనుభవం ఉన్నా తనను ఏ కోశానా పరిగణనలోకి తీసుకోకపోవడం సంజయ్‌ను తీవ్రంగా కలచివేసింది. కార్పొరేషన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చి, తీరా సమయం వచ్చేసరికి మొండిచేయి




చూపారని ఆయన మండిపడుతున్నారు. పార్టీలో సరైన గౌరవం దక్కని చోట కొనసాగడం వృథా అని ఆయన నిర్ణయానికి వచ్చినట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తన తండ్రి వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకున్న ఓ నేతే ఇప్పుడు తనకు అడ్డుపడుతున్నారని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. జిల్లా రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగిన డీఎస్ కుటుంబానికి ఇప్పుడు కాంగ్రెస్‌లో ప్రాధాన్యం తగ్గించడం వెనుక పెద్ద కుట్ర ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పథకం ప్రకారమే సంజయ్‌కు తగిన గుర్తింపు ఇవ్వకుండా, పార్టీ కార్యక్రమాలకు దూరం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. 'పొమ్మనలేక పొగబెట్టినట్లు' పార్టీలో పరిస్థితి తయారైందని సంజయ్ తన అనుచరుల వద్ద వాపోయినట్లు తెలిసింది. ముఖ్యంగా గత 12 నెలలుగా జరిగిన అన్ని ఎన్నికల్లోనూ శక్తివంచన లేకుండా పనిచేసినా, ఫలితం మాత్రం శూన్యంగా మిగిలిందనేది ఆయన వాదన. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోదరుడైన సంజయ్, కుటుంబం కంటే పార్టీ సిద్ధాంతాలకే ప్రాధాన్యతనిచ్చినప్పటికీ నాయకత్వం గుర్తించకపోవడం విశేషం.

కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం తాను ఎదుర్కొంటున్న సందిగ్ధావస్థపై సంజయ్ ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో ఉండాలా లేదా అనే అంశంపై తన సన్నిహిత కార్యకర్తలతో పలుమార్లు చర్చలు జరిపారు. ఎంతో మందికి రాజకీయ భవిష్యత్తునిచ్చిన డీఎస్ వారసుడిగా ఉండి, ఇప్పుడు తనకే గుర్తింపు లేకపోవడం అవమానకరమని ఆయన భావిస్తున్నారు. అందుకే ఆవేదనతో అంటిపెట్టుకుని ఉండటం కంటే, బయటకు వచ్చి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడమే ఉత్తమమని ఆయన యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో సంజయ్ నిష్క్రమణ పట్ల కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. తండ్రి శ్రీనివాస్ మరణించిన సమయంలో 'తనపై కాంగ్రెస్ జెండా కప్పాలి' అని కోరుకున్నంతగా ఆ కుటుంబానికి హస్తం పార్టీతో విడదీయలేని అనుబంధం ఉంది. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన సంజయ్, ఇప్పుడు అదే జెండాను వదిలిపెట్టాలని అనుకోవడం వెనుక ఉన్న అసంతృప్తి ఎంత లోతైనదో అర్థం చేసుకోవచ్చు. పార్టీ పెద్దలు తనను పట్టించుకోకపోగా, కనీసం చర్చలకు కూడా పిలవకపోవడం ఆయనను మరింత బాధించింది. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో తనకున్న పట్టును చూసి భయపడి కొందరు నేతలు తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటున్నారని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. ఈ పరిస్థితుల్లో రాజీనామా ఒక్కటే మార్గమని ఆయన భావిస్తున్నారు. రాజకీయాల్లో వారసులకు ప్రాధాన్యం దక్కడం లేదనే చర్చ కూడా ఈ సందర్భంగా తెరపైకి వస్తోంది. కేవలం అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే గుర్తుకు తెచ్చుకుని, పదవుల పంపిణీ సమయంలో పక్కన పెడుతున్నారనే విమర్శలు కేవలం సంజయ్ విషయంలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో వినిపిస్తున్నాయి. సంజయ్ రాజీనామా చేస్తే ఆయన వెంట వెళ్లేందుకు వందలాది మంది కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఆయన తన భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేసుకున్నారని, త్వరలోనే హైదరాబాద్‌లో ముఖ్య అనుచరులతో భేటీ కానున్నారని సమాచారం. ఈ సమావేశం తర్వాతే తన రాజీనామాపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఇది పెద్ద రాజకీయ కుదుపుగానే చెప్పాలి. జిల్లాలోని మొత్తం నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడంలో డీఎస్ కుటుంబం పాత్ర కీలకం. అటువంటి కుటుంబం నుంచి ఒకరు వైదొలగడం అంటే కేడర్‌లో ధైర్యం దెబ్బతినడమే. గత 30 ఏళ్లుగా ఆ కుటుంబంతో అనుబంధం ఉన్న నాయకులు ఇప్పుడు సంజయ్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. రాజకీయ పక్షాల మధ్య పోరు కంటే, పార్టీ అంతర్గత కుమ్ములాటలే సంజయ్ వంటి నేతలను బయటకు పంపుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ అధిష్ఠానం ఇప్పటికైనా కలుగజేసుకోకపోతే మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సంజయ్ వంటి విద్యావంతుడు, అనుభవం ఉన్న నేత నిష్క్రమణతో జిల్లాలో సామాజిక సమీకరణాలు కూడా మారే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రత్యర్థి పార్టీలు ఆయనకు గాలం వేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## గడ్డపోతారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

**విశాలభారతి, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలోని గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతం భారీ అగ్నిప్రమాదంతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానిక గోదాంలో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు పెను ప్రమాదానికి దారితీశాయి. గత రెండున్నర గంటలుగా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నప్పటికీ, పరిస్థితి ఇంకా పూర్తిగా నియంత్రణలోకి రాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గోదాంలో నిల్వ ఉంచిన సాల్వెంట్ కెమికల్ డ్రమ్ములు ఒక్కసారిగా పేలిపోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. డ్రమ్ముల్లో ముడిసరుకు భారీగా ఉండటంతో మంటలు క్షణాల్లో వ్యాపించి, దట్టమైన నల్లటి పొగ ఆకాశమంతటా కమ్మేసింది. ఈ అగ్నికీలల తీవ్రత కారణంగా సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. అయితే, కెమికల్ సాల్వెంట్స్ ఉండటం వల్ల మంటలు తగ్గకపోగా మరింతగా ఎగసిపడుతున్నాయి. దీనికి తోడు దట్టమైన పొగ కారణంగా లోపలికి వెళ్లడం అగ్నిమాపక సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది. ప్రమాద తీవ్రత దృష్ట్యా మంటలు పక్కనే ఉన్న ఇతర పరిశ్రమలకు వ్యాపించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు . ఈ భారీ అగ్నిప్రమాదంలో గోదాంలోని ముడిసరుకు పూర్తిగా అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చని ప్రాథమిక అంచనా.

విశాల భారతి



# కుంట్లూరు చెరువుల పునరుద్ధరణకు వేగం

### హైడ్రా అధికారుల ప్రత్యక్ష పరిశీలన.. ముదిరాజ్ సంఘం ఫిర్యాదు



ఇరిగేషన్ డి ఈ ఆంజనేయులు



ఇరిగేషన్ ఏఈ శ్రీ వాణి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా కుంట్లూరు డివిజన్‌లోని చిన్న చెరువు, పెద్ద చెరువులను హైడ్రా అధికారులు శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం నేతలు చేసిన ఫిర్యాదుల మేరకు ఈ పరిశీలన చేపట్టడం జరిగింది. రాబోయే వర్షాకాలంలో చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని సంఘం ప్రతినిధులు కోరారు. కుంట్లూరు డివిజన్‌లోని చిన్న చెరువు, పెద్ద చెరువు పక్కపక్కనే ఉండగా, ఈ చెరువుల్లో చేపల పెంపకానికి అనుకూల పరిస్థితులు కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా వరద నీరు చెరువుల్లోకి సులభంగా చేరేలా కాలువలను శుభ్రపరచడం, పాడైన తూములను పూర్తిగా మరమ్మతు చేయడం అవసరమని ముదిరాజ్ సంఘం సభ్యులు వివరించారు. ప్రస్తుతం కాలువలు నిరుపయోగంగా మారడం, తూములు దెబ్బతినడం వల్ల చెరువులకు నీటి చేరికలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా ఈఈ అర్చన, ఇరిగేషన్ డీఈ ఆంజనేయులు మాట్లాడుతూ...వచ్చిన ఫిర్యాదుల మేరకు చెరువులను సమగ్రంగా పరిశీలించామని, అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నా, ఎంతటి వ్యక్తులైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అధికారులు చిన్న చెరువు నుండి పెద్ద చెరువు వరకు నడుచుకుంటూ వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలన నిర్వహించారు. నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని నోట్ చేసుకున్నారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హైడ్రా శాఖల సమన్వయంతో చెరువులకు నీరు సులభంగా చేరేలా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఈఈ అర్చన, జీహెచ్ఎంసీ ఈఈ నాగేందర్ కుమార్, ఇరిగేషన్ డీఈ ఆంజనేయులు, ఏఈ శ్రీ వాణి, జీహెచ్ఎంసీ డీఈ సుమంత్‌తో పాటు కుంట్లూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు, స్థానిక ప్రజలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మగ్గం మూగబోయె..!

**మొదటిపేజీ తరువాయి**

చేనేత రంగంపై ఆధారపడి బతుకుతున్న కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వమే, వారి పొట్ట కొట్టేలా వ్యవహరిస్తోందన్న ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనిస్తే నేతన్నల కళ్లలో కన్నీరు తప్ప ఆశ రేఖలు కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో చదువుకునే లక్షలాది మంది విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల తయారీ బాధ్యతను గతంలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు అప్పగించేవారు. దీనివల్ల ప్రభుత్వానికి నాణ్యమైన వస్త్రం అందడంతో పాటు వేలాది మంది కార్మికులకు ఏడాది పొడవునా పని దొరికేది. రాజీవ్ విద్యామిషన్ వంటి పథకాల కింద దాదాపు 105 కోట్ల రూపాయల విలువైన ఆర్డర్లు నేరుగా నేతన్నలకే దక్కేవి. కానీ ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్నా ఆర్డర్ల ఊసే లేకపోవడంతో కార్మికుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మగ్గాల మీద బట్ట నేయాల్సిన చేనేత కార్మికులు ఇప్పుడు ధర్నా చౌక్‌ల వద్ద నిరసనలు తెలపాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా సిరిసిల్ల ప్రాంతంలో పవర్‌లూమ్ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. అక్కడ దాదాపు 30 వేల పవర్‌లూమ్స్ ఉండగా, ప్రత్యక్షంగా 25 వేల మంది కార్మికులు వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఏడాది ఇచ్చే బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాం ఆర్డర్లే వీరికి ప్రధాన ఆధారం. అయితే ఈసారి ప్రభుత్వం ఓపెన్ టెండర్ విధానాన్ని తెరపైకి తెచ్చి కార్మికుల ఆశలపై నీళ్లు చల్లింది. ఈ విధానం వల్ల బడా కాంట్రాక్టర్లు లాభపడతారే తప్ప, కాయకష్టం చేసే సామాన్య కార్మికుడికి దక్కేది శూన్యమని కార్మిక సంఘాలు గొంతు ఎత్తుతున్నాయి. ఇప్పటికే అప్పులు చేసి నూలు, రంగులు కొనుగోలు చేసిన యజమానులు ఇప్పుడు ఆ సరుకును ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చేనేత సహకార సంఘాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఇక్కడ ఉన్న 56 చేనేత సంఘాలు, 35 కోఆపరేటివ్ సొసైటీల్లోని




పదివేల మందికి పైగా కార్మికులు ఇప్పుడు పని లేక ఖాళీగా ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే బెడ్ షీట్లు, టవల్స్, కార్పెట్ల తయారీ ఆర్డర్లు నిలిచిపోవడంతో వారి జీవన ప్రమాణాలు పడిపోయాయి. గతంలో నిరంతరం పని ఉండటం వల్ల వలసలు తగ్గాయి, కానీ ఇప్పుడు మళ్ళీ పొట్ట చేతబట్టుకుని ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తమకు న్యాయం చేయాలని నేతన్నలు కోరుతున్నా అధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్వయంగా జారీ చేసిన జీవోలను పక్కన పెట్టడం ఇక్కడ గమనార్హం. 2024 మార్చిలో ప్రభుత్వం జీవో నంబరు 1ను విడుదల చేస్తూ, ప్రభుత్వ అవసరాలకు కావాల్సిన వస్త్రాలను టెస్కో ద్వారానే సేకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్ల విద్యార్థుల యూనిఫాంలు సైతం చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేయాలని అందులో పేర్కొన్నారు. కానీ ఆ నిబంధనలను బేఖాతరు చేస్తూ విద్యాశాఖ ఓపెన్ టెండర్లకు మొగ్గు చూపడం వెనుక పెద్ద ఎత్తున కమీషన్ల దందా నడుస్తోందని కార్మిక నేతలు ఆరోపిస్తున్నారు. చట్టబద్ధంగా తమకు రావలసిన హక్కును కాలరాస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు.

ముస్లిం సోదరులకు పండుగ కానుకగా అందజేసే రమజాన్ తోఫా విషయంలోనూ చేనేత కార్మికులకు మొండిచేయి ఎదురైంది. ప్రతి ఏటా ఈ వస్త్రాల తయారీ బాధ్యతను స్థానిక కార్మికులకే ఇచ్చేవారు. కానీ ఈసారి ఒక ప్రైవేటు కంపెనీకి ఈ ఆర్డర్లను కట్టబెట్టడం విస్మయానికి గురిచేస్తోంది. సొంత రాష్ట్రంలోని కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యతను విస్మరించి, పొరుగు రాష్ట్రాల సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఇక్కడి నేతన్నల ఉపాధి గండి పడుతోంది. పండుగ సమయంలో చేతినిండా పని ఉండి సంతోషంగా గడపాల్సిన కుటుంబాలు ఇప్పుడు పూట గడవక అల్లాడిపోతున్నాయి. ప్రభుత్వ వైఖరి తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని కార్మికులు వాపోతున్నారు. నేతన్నల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రాజ్యసభ సభ్యులు, ప్రజా ప్రతినిధుల ద్వారా వినతిపత్రాలు సమర్పించినా పాలనాయంత్రాంగంలో చలనం రావడం లేదు. సిరిసిల్ల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమలు మూతపడటం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. కార్మికుల ఆవేదనను అర్థం చేసుకుని తక్షణమే పాత విధానంలోనే టెస్కో ద్వారా ఆర్డర్లు ఇవ్వాలని నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో సామూహిక ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడతారా లేక కాంట్రాక్టర్ల పక్షాన ఉంటారా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ పక్షాలు సైతం ఈ అంశంపై గొంతు సవరించాయి. శాసనసభలోనూ చేనేత సంక్షోభంపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకుని మార్చి 11న ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థుల యూనిఫాం తయారీకి సంబంధించిన 105 కోట్ల రూపాయల బడ్జెట్ నేరుగా టెస్కో ఖాతాలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. బడ్జెట్‌లో చేనేత రంగానికి కేటాయింపులు పెంచడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ, త్రిఫ్ట్ ఫండ్ డిపాజిట్లను వెంటనే విడుదల చేయాలని శాసనసభ్యులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని చేనేత కార్మికులు కూడా ఇదే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత రెండు దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాన్ని అకస్మాత్తుగా మార్చడం వల్ల వారి జీవన సరళి అస్తవ్యస్తమైంది. ఒక్కో మగ్గం వెనుక ఒక కుటుంబం మొత్తం కష్టపడుతుంది. ఇప్పుడు పని లేకపోవడంతో ఆ కుటుంబాలన్నీ ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. ఓపెన్ టెండర్ విధానం వల్ల నాణ్యత లేని వస్త్రం సరఫరా అయ్యే అవకాశం ఉండటమే కాకుండా, స్థానిక వృత్తి నైపుణ్యం కనుమరుగయ్యే ముప్పు ఉంది. ప్రభుత్వ సంస్థలకు ఏ వస్తువు కావాలన్నా చేనేత సహకార సంఘాల నుంచే సేకరించాలనే నిబంధనను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. చేనేత రంగం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, అది తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఈ కళను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై, ముఖ్యంగా ప్రభుత్వంపై ఉంది. టెండర్ల పేరుతో ఈ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టడం వల్ల అంతిమంగా నష్టపోయేది నేతన్నలే. వేల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఓపెన్ టెండర్ల ప్రక్రియను రద్దు చేసి, నేరుగా టెస్కో ద్వారానే అన్ని రకాల వస్త్రాల కొనుగోళ్లు జరపాలి. అప్పుడే నేతన్నల ఇళ్లలో మళ్లీ దీపాలు వెలుగుతాయి.

# ప్రభుత్వానికి వేతన వేదన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణ ఖజానాకు ఉద్యోగుల వేతనాల చెల్లింపు పెను సవాలుగా పరిణమించింది. ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం జీతభత్యాలకే ఖర్చవుతుండటంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధుల సర్దుబాటు చేయడం ఆర్థిక శాఖకు తలనొప్పిగా మారింది. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం ఆశాజనకంగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న వ్యయం దానికి ఏమాత్రం సరిపోవడం లేదు. ఒకవైపు పాత బకాయిలు, మరోవైపు కొత్త నియామకాలతో కూడిన అదనపు భారం ఖజానాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఆర్థిక క్రమశిక్షణ పాటించని పక్షంలో భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగుల నుంచి వస్తున్న డిమాండ్లు సర్కారుకు గుదిబండగా మారాయి. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం వాయిదాలు, కొత్త పీఆర్సీ ఫిట్‌మెంట్ నిర్ణయం, పదవీ విరమణ చేసిన వారికి అందాల్సిన ప్రయోజనాలు వంటివి పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించాలంటే భారీస్థాయిలో నిధులు అవసరమవుతాయి. ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలా లేక ప్రాధాన్యత క్రమంలో ఇతర పథకాలకు నిధులు మళ్లించాలా అనే సందిగ్ధంలో యంత్రాంగం కొట్టుమిట్టాడుతున్నది. ప్రతి పైసాను ఆచితూచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలను పరిశీలిస్తే గత ఏడాదితో పోలిస్తే వేతనాల భారం గణనీయంగా పెరిగింది. కొత్తగా రిక్రూట్ అయిన 67 వేల మంది ఉద్యోగులు ఈ ఆర్థిక సంవత్సరంలో విధుల్లో చేరడంతో వారి జీతాల కోసం అదనంగా నిధులు కేటాయించాల్సి వస్తున్నది. నెలకు సగటున ఐదు నుంచి ఆరు వేల కోట్ల రూపాయలు కేవలం జీతభత్యాల రూపంలోనే ఖజానా నుంచి బయటకు వెళ్తున్నాయి. ఇది రాష్ట్ర మొత్తం ఆదాయంలో దాదాపు సగం వాటాకు సమానం కావడం గమనార్హం. పాలనా యంత్రాంగం ఇంతటి భారీ వ్యయాన్ని భరించడం కత్తిమీద సాములా మారింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియ వేగవంతం కావడంతో జనరల్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాల సంఖ్యలోనూ భారీ మార్పులు సంభవించాయి. గత రెండేళ్ల కాలంలోనే సుమారు 27 వేల కొత్త జీపీఎఫ్ ఖాతాలు ప్రారంభమైనట్లు ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఖాళీల భర్తీతో సంబంధం లేకుండా నియామకాలు పూర్తి కావడంతో ఈ పెరుగుదల కనిపిస్తున్నది. దేశంలోనే అత్యధిక వేతనాలు అందిస్తున్న రాష్ట్రంగా గుర్తింపు పొందిన తెలంగాణ, ఆ స్థాయిని నిలబెట్టుకోవడానికి పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వ ప్రాధాన్యతలు మారుతున్న క్రమంలో ఈ వ్యయం పెను భారం కాక తప్పదు. పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్షాళన చర్యలు ఆసక్తికర ఫలితాలను ఇచ్చాయి. రాష్ట్రంలో పెద్ద ఎత్తున బోగస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం, అన్ని శాఖల అధిపతుల నుంచి సమగ్ర వివరాలు సేకరించింది. ఆధార్ కార్డులతో అనుసంధానించడం ద్వారా అనర్హులను ఏరివేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం పని చేస్తున్న వారెవరో, కేవలం కాగితాల మీద ఉన్నవారెవరో స్పష్టమైన లెక్క తేలింది. ఈ ప్రక్షాళన అనంతరం వాస్తవంగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వివరాలతో కొత్త డేటాబేస్ సిద్ధమైంది. తనిఖీల్లో వెల్లడైన వివరాలు ఉన్నతాధికారులను సైతం విస్మయానికి గురిచేశాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో సుమారు 40 వేల మంది బోగస్ ఉద్యోగులు ఉన్నట్లు ఈ ఏరివేత ప్రక్రియ ద్వారా వెల్లడైంది. అనర్హులను తొలగించిన తర్వాత ప్రస్తుతం 4.96 లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం ధ్రువీకరించింది. వీరందరికీ సంబంధించిన వివరాలను ఆర్థిక శాఖ ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ వేదికపై నిక్షిప్తం చేసింది. దీనివల్ల భవిష్యత్తులో నిధుల దుర్వినియోగానికి తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లయింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మెకానిజం ప్రకారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే నమోదు కావాల్సి ఉంటుంది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ప్రమేయం లేకుండా నేరుగా ఆయా కార్యాలయాల అధికారులే బాధ్యత వహించేలా నిబంధనలు మార్చారు. జిల్లా కలెక్టర్లు, విభాగాధిపతులు తమ పరిధిలోని సిబ్బంది డేటాను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనివల్ల మధ్యవర్తుల అక్రమాలకు చెక్ పడటమే కాకుండా, ప్రభుత్వ అధికారులను జవాబుదారీగా మార్చే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఖజానాపై పడుతున్న అనవసర భారాన్ని తగ్గించేందుకు ఇది మేలైన మార్గమని నిపుణులు భావిస్తున్నారు. ప్రతి నెలా సమకూరుతున్న ఆదాయంలో మెజారిటీ వాటా జీతాలకే వెళ్తుండటంతో ఇతర అవసరాలకు నిధుల కొరత ఏర్పడుతున్నది. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయింపులు తగ్గించాల్సిన పరిస్థితి వస్తున్నది. అప్పుల రూపంలో తెస్తున్న నిధులను కూడా వేతనాలకే మళ్లించాల్సి రావడం ఆందోళన కలిగిస్తున్న అంశం. రాష్ట్ర అప్పుల పరిమితి దాటిపోతున్న తరుణంలో, వ్యయ నియంత్రణ పాటించకపోతే ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఆదాయ వనరులను పెంచుకోవడంపై సర్కారు ఇప్పుడు దృష్టి సారించాల్సి ఉంది.

# కేటీఆర్ బెస్ట్ కమెడియన్

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి కీలకమైన విశ్లేషణ చేశారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా మెరిట్, డిసబిలిటీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల పెంపు జరగాలని ఆయన సూచించారు. బీజేపీ తీసుకొస్తున్న ఈ ప్రతిపాదనల వెనుక స్పష్టమైన రాజకీయ స్వార్థం దాగి ఉందని ఆరోపించారు. ఒక శాస్త్రీయమైన చర్చ లేకుండా, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోకుండా హడావుడిగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చేలా, అభివృద్ధి చెందిన దక్షిణాదిని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తోందని ఆయన మండిపడ్డారు. వివక్షతో కూడిన నిర్ణయాలను ఏమాత్రం అంగీకరించబోమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ వైఖరిని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. తాము మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేసే విధానంలో కేంద్రం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే ఎటువంటి జాప్యం లేకుండా 181 సీట్లను మహిళలకు కేటాయించే అవకాశం ఉందని ఆయన గణాంకాలతో వివరించారు. పునర్విభజన, జనగణన పేరుతో మహిళా బిల్లును అటకెక్కించడం సరికాదని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళా బిల్లును ఒక ఆయుధంగా వాడుకోవడం మానుకోవాలని సూచించారు. తక్షణమే చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తు చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందుతున్న ఆర్థిక సహాయంపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి పన్నుల రూపంలో ఒక రూపాయి చెల్లిస్తే, కేంద్రం నుంచి తిరిగి వస్తున్నది కేవలం 42 పైసలు మాత్రమేనని ఆయన గణాంకాలను ఉటంకించారు. సంపదను సృష్టించి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వసూలయ్యే నిధులను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించడం వల్ల ఇక్కడ అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వివక్ష వల్ల దక్షిణాది ప్రజలు రెండో తరగతి పౌరుల్లా భావించాల్సి వస్తోందని ఆవేదన చెందారు.



తెలంగాణలో చేపట్టిన సంస్కరణల గురించి ముఖ్యమంత్రి గర్వంగా వివరించారు. కేవలం ఐదు నెలల స్వల్ప కాలంలోనే రాష్ట్రంలో జనగణనతో పాటు కుల గణనను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. పారదర్శకమైన పాలన, సామాజిక న్యాయం అందించడంలో తమ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి, రైతుల నుంచి తీవ్ర నిరసనలు ఎదురైన తర్వాత ఎలాగైతే వెనక్కి తీసుకుందో, ఇప్పుడు కూడా నియోజకవర్గాల పెంపు విషయంలో అదే పొరపాటు చేస్తోందని విమర్శించారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రాల హక్కులను కాలరాసే ఏ చట్టాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీనియర్లకు అవమానం జరిగిందని కేటీఆర్ మాట్లాడటం ఈ దశాబ్దపు అతిపెద్ద హాస్యాస్పదమైన విషయమని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో ఆలె నరేంద్ర, దేశిని చిన్న మల్లయ్య, ఈటల రాజేందర్ వంటి ఉద్యమ నేతలను బీఆర్ఎస్ ఏ విధంగా అవమానించిందో ప్రజలందరికీ తెలుసని గుర్తు చేశారు. పార్టీ కోసం రక్తం ధారబోసిన సీనియర్లను పక్కన పెట్టి, కుటుంబ సభ్యులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని విమర్శించారు. ఇప్పుడు సీనియర్ల గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ఎదుటివారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే చిన్న రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు ఈ పునర్విభజన ఒక శాపంలా మారుతుందని విశ్లేషించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ప్రతిపాదనపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని, కేంద్రం మొండిగా ముందుకు వెళ్తే రాజకీయ సంక్షోభం తలెత్తుతుందని హెచ్చరించారు. అవసరమైతే పార్లమెంటు లోపల, బయట ఇతర సమాన ఆలోచనలు ఉన్న పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని ప్రకటించారు. సమాఖ్య స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, రాష్ట్రాలను బలహీనపరిచే చర్యలను మానుకోవాలని సూచించారు. రైతుల సమస్యల పట్ల తమ ప్రభుత్వం అత్యంత సానుకూలతతో ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్రం గతంలో తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను గుర్తు చేస్తూ, రైతుల శ్రేయస్సును విస్మరిస్తే ఎదురయ్యే పరిణామాలు ఎలా ఉంటాయో ఇప్పటికే నిరూపితమైందని అన్నారు. తెలంగాణలో రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రుణమాఫీ వంటి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులను ఆందోళనలకు గురిచేసే ఏ నిర్ణయాన్నీ తమ ప్రభుత్వం అనుమతించబోదని స్పష్టం చేశారు. కేంద్రం సైతం రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విధానాలను రూపొందించాలని కోరారు.

# ముగిసిన దశాబ్దాల పోరాటం!

**మొదటిపేజీ తరువాయి**

ఇది నిదర్శనంగా నిలుస్తోంది. లొంగిపోయిన వారి వివరాల్లోకి వెళితే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండర్ సోది మల్లా అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ లొంగుబాటు పార్టీకి కోలుకోలేని దెబ్బగా మారింది. నిఖిల్ నాయకత్వంలోనే గతంలో అనేక దాడులు ప్రణాళికాబద్ధంగా సాగాయి. అతనితో పాటు జేఎంఎంపీ సెక్రటరీగా పనిచేస్తున్న తెలంగాణ స్టేట్ కమిటీ మిలిటరీ చీఫ్ చప నారాయణ అలియాస్ గజేందర్ అలియాస్ మధు లొంగిపోవడం పార్టీ రక్షణ కవచం విచ్ఛిన్నమైనట్లు సూచిస్తోంది. వీరితో పాటు బీకేఏఎస్ఆర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కడ్తి సన్ను అలియాస్ మంతు కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మొత్తం 42 మంది క్యాడర్లు మూడు వేర్వేరు విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో 21 మంది పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన వారు కాగా, 11 మంది తెలంగాణ స్టేట్ కమిటీలో, మరో 10 మంది దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహించిన వారు కావడం గమనార్హం. ఈ లొంగుబాటు ప్రక్రియలో మావోయిస్టులు తమ వద్ద ఉన్న అత్యాధునిక ఆయుధ సంపత్తిని పోలీసులకు అప్పగించారు. అడవుల్లో గెరిల్లా యుద్ధానికి వాడే 5 ఏకే47 రైఫిళ్లు, 4 ఎస్ఎల్ఆర్‌లు, 3 ఐఎన్ఎస్ఏఎస్ రైఫిళ్లు ఇప్పుడు పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నాయి. వీటితో పాటు 6 .303 రైఫిళ్లు, 9 ఎంఎం స్టెన్ గన్, 2 8ఎంఎం రైఫిళ్లు, 10 సింగిల్ షాట్ గన్స్, 9 ఎంఎం పిస్టల్, రెండు రివాల్వర్లు సైతం స్వాధీనం చేసుకున్నారు. యుద్ధ తంత్రంలో కీలకమైన బీజీఎల్ గన్‌తో పాటు ఎయిర్ గన్ కూడా అప్పగించారు. ప్రాణాంతకమైన రెండు దేశీయ గ్రెనేడ్లతో పాటు మొత్తం 36 రకాల ఆయుధాలను పోలీసులు రికవరీ చేశారు. కేవలం ఆయుధాలే కాకుండా 1007 రౌండ్ల తూటాలను సైతం వారు అప్పగించారంటే పార్టీ ఏ స్థాయిలో నిరాయుధమైందో అర్థం చేసుకోవచ్చు.

ఆయుధాలతో పాటు పార్టీకి చెందిన ఆర్థిక వనరులు కూడా బయటకు రావడం గమనార్హం. లొంగిపోయిన బృందం సుమారు 800 గ్రాముల బంగారాన్ని పోలీసులకు అప్పగించింది. ఈ భారీ మొత్తంలోని బంగారం తెలంగాణ స్టేట్ కమిటీ నిధులుగా భద్రతా దళాలు గుర్తించాయి. పార్టీ కార్యకలాపాల కోసం నిల్వ ఉంచిన ఈ సొత్తు ఇప్పుడు ప్రభుత్వ పరం కావడంతో మావోయిస్టు ఆర్థిక మూలాలు దెబ్బతిన్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు కోల్పోవడమే కాకుండా నిధుల నిర్వహణలో తలెత్తిన ఇబ్బందులు కూడా నాయకత్వాన్ని కుంగదీశాయని తెలుస్తోంది. సిద్ధాంతాల కంటే మనుగడ కష్టంగా మారిన పరిస్థితుల్లోనే వీరు బయటకు వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తూ తదుపరి వ్యూహాలను రూపొందిస్తోంది. ఈ భారీ లొంగుబాటుతో తెలంగాణ స్టేట్ కమిటీ కథ దాదాపు ముగిసినట్లేనని పోలీసులు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. ఒకప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలను సమన్వయం చేస్తూ సమాంతర వ్యవస్థను నడిపిన ఈ కమిటీ ఇప్పుడు కార్యాచరణ స్థాయిలో నామమాత్రంగా కూడా లేదని స్పష్టం చేశారు. ప్రధాన నాయకత్వం లొంగిపోవడంతో కింది స్థాయి క్యాడర్‌లో తీవ్ర నైతిక స్థైర్యం దెబ్బతింది. తెలంగాణ గడ్డపై పార్టీ ఉనికిని చాటేందుకు ప్రయత్నించిన ప్రధాన కమిటీ ఇప్పుడు పూర్తిగా నిర్వీర్యమైపోయింది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రభావాన్ని పునరుద్ధరించాలని చూసిన మావోయిస్టుల ఆశలు ఈ పరిణామంతో అడియాశలయ్యాయి. ఇకపై రాష్ట్రంలో వారి కదలికలు ఉండటం అసాధ్యమని భద్రతా వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.




కేవలం రాజకీయ కమిటీలే కాకుండా మావోయిస్టుల సైనిక దళమైన పీఎల్‌జీఏ బెటాలియన్ కూడా విచ్ఛిన్నం కావడంతో అడవుల్లో తుపాకుల మోత మూగబోయే అవకాశం కనిపిస్తోంది. వరుస లొంగుబాట్ల వల్ల పార్టీలో తీవ్రమైన నాయకత్వ శూన్యత ఏర్పడింది. ఆదేశాలు ఇచ్చే వారు లేక, క్షేత్రస్థాయిలో పోరాడే శక్తి లేక క్యాడర్ అయోమయంలో ఉంది. అధికారిక గణాంకాల ప్రకారం 2024 నుంచి ఇప్పటివరకు ఏకంగా 761 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు.

# అన్నా..దేవుడే పంపించాడన్నా!

**మొదటిపేజీ తరువాయి**

శుక్రవారం మధ్యాహ్నం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ కలయిక కేవలం ఒక రాజకీయ చర్చగా కాకుండా అత్యంత ఆత్మీయంగా సాగింది. తన పాత మిత్రుడిని చూసిన వెంటనే జీవన్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో కేసీఆర్‌తో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. "అన్నా.. మీతో కలిసి పనిచేయమని ఆ దేవుడే నన్ను పంపించాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడ ఉన్న వారిని ఆశ్చర్యానికి గురిచేశాయి. రాజకీయాల్లో విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవం ఎప్పుడూ తగ్గలేదని ఈ కలయిక నిరూపించింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తనదైన శైలిలో స్పందించిన జీవన్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణకు ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల్లో కేసీఆర్ నాయకత్వం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో అనుభవం కలిగిన నేతలు కలిసి పనిచేస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని బలంగా నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత మళ్ళీ కేసీఆర్ సారథ్యంలో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. మనసు విప్పి మాట్లాడిన ఆయన మాటల్లో పార్టీ మార్పు పట్ల ఒక స్పష్టత కనిపించింది. ఎర్రవల్లి నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఎదురేగి ఆయనను ఆహ్వానించారు. మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ చారిత్రాత్మక



ఘట్టానికి సాక్షులుగా నిలిచారు. ఎర్రవల్లి ప్రాంగణం అంతా గులాబీ జెండాలతో, కార్యకర్తల కోలాహలంతో సందడిగా మారింది. తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన జీవన్ రెడ్డికి ఇది ఒక ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు ఈ భేటీతో తెరపడింది. లోపలికి ఆహ్వానించిన కేసీఆర్ తన పాత మిత్రుడికి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా అలింగనం చేసుకున్నారు. శాలువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఇద్దరు అగ్ర నేతలు పక్క పక్కన కూర్చుని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై లోతైన విశ్లేషణలు జరిపారు. కేసీఆర్ సాదర ఆహ్వానం చూసి జీవన్ రెడ్డి అభిమానులు, అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకుల మధ్య ఉన్న ఈ అనుబంధం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని గులాబీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కీలక కార్యక్రమంలో పార్టీకి చెందిన ముఖ్య నేతలందరూ పాలుపంచుకున్నారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి తమ సీనియర్ సహచరుడి రాకను సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ కూడా ఈ భేటీలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు వంటి నేతలు జీవన్ రెడ్డి చేరికపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే మాజీ జడ్పీ చైర్ పర్సన్ దంపతులు వసంత సురేశ్ కూడా ఈ కార్యక్రమంలో మెరిశారు. పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు జీవన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. జీవన్ రెడ్డి వంటి మేధావి, రాజకీయ దురంధరుడు పార్టీలోకి రావడం వల్ల ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ మరింత పటిష్టం అవుతుందని నేతలు విశ్లేషిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకున్న పట్టు పార్టీకి అదనపు బలం కానుంది. దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న ఆయన ఇప్పుడు తన అనుభవాన్ని గులాబీ పార్టీ అభివృద్ధికి వెచ్చించనున్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సామెతను ఈ పరిణామం మరోసారి గుర్తుచేసింది. జగిత్యాల ప్రాంతం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు తమ నేత నిర్ణయాన్ని సమర్థిస్తూ భారీగా తరలివచ్చారు. దశాబ్దాలుగా ఆయన వెంటే నడుస్తున్న అభిమానులు తమ నాయకుడికి సముచిత గౌరవం దక్కుతుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు, సీనియర్లకు లభిస్తున్న ప్రాధాన్యతపై అసంతృప్తితో ఉన్న ఆయన చివరకు సరైన వేదికను ఎంచుకున్నారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ మారినా తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని, కేవలం రాష్ట్ర శ్రేయస్సు కోసమే ఈ అడుగు వేసినట్లు జీవన్ రెడ్డి తన అనుచరులకు స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించిన ప్రగతిని జీవన్ రెడ్డి కొనియాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పోరాట పటిమను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఆలోచనా విధానం, ఆయనకున్న విజన్ రాష్ట్రానికి దిక్సూచిలాంటిదని కొనియాడారు. గ్యాప్ వచ్చినా సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నట్లు తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రస్థానంలో ఇది అత్యంత కీలకమైన మలుపు అని, భవిష్యత్తులో పార్టీ అప్పగించే బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు.

రాజకీయాల్లో విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన జీవన్ రెడ్డి రాజీనామా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బగానే భావించవచ్చు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయన ప్రభావం ఇతర నియోజకవర్గాలపై కూడా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బలమైన ఓటు బ్యాంకు, వర్గపోరు లేని నాయకత్వం ఆయన సొంతం. అటువంటి నాయకుడు బీఆర్ఎస్ గూటికి చేరడం వల్ల ఆ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఈ మార్పు ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జీవన్ రెడ్డి అనుచరులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## బంజారా కాలనీ స్మశాన వాటిక పనుల పరిశీలన

**మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీ హిందూ స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం స్వయంగా పరిశీలించారు. సుమారు 6 కోట్ల రూపాయల భారీ వ్యయంతో చేపడుతున్న ఈ పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆధునిక హంగులతో ఈ స్మశాన వాటికను తీర్చిదిద్దుతున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ భవనానికి స్థలం కేటాయించండి



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. బండ్లగూడ జాగిర్ ప్రాంతంలో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక భవనం ఏర్పాటు చేసుకునే అవసరాన్ని వివరించి, ఇందుకు తగిన స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది. వృద్ధుల కోసం సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. సీనియర్ సిటిజన్స్‌కు సమావేశాలు నిర్వహించుకునే స్థలం, ఆరోగ్యపరమైన మరియు సామాజిక కార్యకలాపాలు చేపట్టే వేదికగా ఈ భవనం ఉపయోగపడుతుందని వివరించాం. ఈ అభ్యర్థనను జాయింట్ కలెక్టర్ సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్ గౌడ్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు శివరామిరెడ్డి , రాజ వర్ధన్ రెడ్డి , మల్లారెడ్డి , గుంటి శ్రీనాథ్ తదితర ప్రముఖులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## కేటీఆర్‌ను కలిసిన కస్తూరి నరేందర్ ముదిరాజ్

**కుటుంబ వేడుకకు ఆహ్వానం**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ గారు ఈరోజు కేటీఆర్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన విషయాలను కూడా ప్రస్తావించారు. కుటుంబ సంబంధిత శుభకార్యంగా తన సోదరుడి కుమారుడి వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కేటీఆర్ గారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. కేటీఆర్ గారు ఆహ్వానాన్ని సానుకూలంగా స్వీకరించి, వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

## అసాంగిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

**రూరల్ ఎస్సై బి సురేష్**



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల వలస ఆదివాసి గ్రామం అయిన ఒంటి గుడిసె గ్రామంలో శుక్రవారం గ్రామోత్సవ్ కార్యక్రమం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ ఎస్సై సురేష్ ఆదివాసీలను ఉద్దేశించి,మాట్లాడుతూ.. ఆదివాసీలు నక్సలిజం వైపు గాని, ఇతర ఎలాంటి అసాంగిక కార్యక్రమలలో పాల్గొనకూడదని అన్నారు.దానివల్ల ఏర్పడే నష్టాలు,ఇబ్బందులు గురించి వివరించారు.మరియు పిల్లలు,యువత గంజాయి, మద్యం వంటి మత్తు మత్తుపదార్థాలకు దూరంగా గావుండాలని అన్నారు. చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమం లో మందెరకలపాడు గ్రామ సర్పంచ్ బానోత్ లక్ష్మి, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు

## పాల ఉత్పత్తిదారుల సహకార భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కేంద్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కీలకమైన అడుగుగా విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి , తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమైక్య లిమిటెడ్ ) చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ఈ సహకార భవనం ద్వారా పాల సేకరణ, నిల్వ, పంపిణీ వంటి సేవలు ఒకే చోట అందుబాటులోకి వచ్చి రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.తద్వారా రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా డెయిరీ ద్వారా మంచి ధరలు పొందే అవకాశముంటుందని, మహిళా సంఘాలు కూడా పాడి పరిశ్రమలో భాగస్వామ్యం కావడం ద్వారా ఆర్థికంగా బలపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డెయిరీ సంఘ సభ్యులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భవనం ప్రారంభంతో దేవరుప్పుల మండలంలో పాడి పరిశ్రమకు కొత్త ఊపు వచ్చి, రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు.

## ఇంటి పన్ను చెల్లించినవారికి ఎర్లీ బర్డ్ ఆఫర్

**ఐదు శాతం రాయితీ అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీ**



**విశాలభారతి, గోదావరిఖని:** ఏప్రిల్ 30, 2026 లోపు ఈ ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను చెల్లించినవారికి ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద ఐదు శాతం రాయితీ ఉందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువు ముగిసేలోగా ఐదు శాతం రాయితీతో 202627 ఆర్థిక సంవత్సరపు ఇంటి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.ఈ మేరకు పన్ను చెల్లించే వారి సౌలభ్యార్థం ప్రభుత్వ సెలవు దినాలైన రెండవ శనివారం , ఆదివారాల్లో కూడా పన్ను వసూలు చేసే సిబ్బంది యధాతథంగా పని చేయడంతో పాటు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు కూడా తెరిచివుంటాయని తెలిపారు.

## ఒలివ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

**నాచారం, విశాలభారతి:** ఒలివ మినిస్ట్రీస్ ట్రస్ట్ పాస్టర్ సిహెచ్ రాజు, మణి దంపతులు ఏర్పాటు చేసినటువంటి ట్రస్టును శుక్రవారం మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం పేద మహిళలకు చీరలను పంపిణీ వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ఒలివ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. పాస్టర్ తిమోతి, వాసు గౌడ్, రాపోల్ సతీష్, శ్యాంసుందర్, అల్లడి కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.




## పదో తరగతి విద్యార్థిని బలవన్మరణం




- తండ్రి స్నేహితుడి వేధింపులే కారణమా?
- కుంట్లూరులో విషాదం.. పోలీసుల దర్యాప్తు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:**

అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని కుంట్లూరులో తీవ్ర విషాదం నెలకొంది. పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కుంట్లూరు వై జంక్షన్ నివాసి, లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నమలితోక కేశవ కుమార్తె రితిక (15). ఈమె స్థానిక లయోలా పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. గురువారం (ఏప్రిల్ 9) మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేని తరుణంలో, రితిక సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని నిమిత్తం బయటకు వెళ్లిన కేశవకు పిల్లలు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, ఆయన సాయంత్రం 7 గంటలకు ఇంటికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న కుమార్తెను చూసి తండ్రి కన్నీరుమున్నీరయ్యారు. రితిక సహవిద్యార్థి వినయ్ తండ్రి రాజ్ కుమార్ గత కొంతకాలంగా బాలికతో ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ద్వారా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వేధింపుల కారణంగానే మనస్తాపానికి గురై రితిక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన జరిగిన తర్వాత కేశవ ఎవరికీ సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని తన స్వగ్రామమైన నాగార్జున సాగర్, హిల్ కాలనీకి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో, హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.రాజ్ కుమార్ వేధింపుల కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రితిక మరణానికి గల కచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక మరియు పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాత వెల్లడి కానున్నాయి. ఈ కేసును హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి. నాగరాజ్ గౌడ్ పర్యవేక్షిస్తున్నారు. ఒక యువ ప్రాణం ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం ఆ కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది.

## వాహక వ్యాధులపై అవగాహన కార్యక్రమం




**బోడుప్పల్, విశాలభారతి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో కార్యచరణ ప్రణాళికలో భాగంగా 36వ రోజు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ నగర్, మల్లికార్జున్ నగర్ కాలనీలో వాహక వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీలను నిర్వహించినట్లు బోడుప్పల్ సర్కిల్ ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ ఏ చైతన్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ హాజరై కాలనీ వాసులకు వాహక వ్యాధులు అనగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, జికా. లైమ్ మొదలగు వ్యాధులు పరాన్న జీవులు, వైరస్లు, బ్యాక్టీరియా ల వల్ల దోమలు, ఈగలు మొదలగు వాహకాల ద్వారా మానవులకు సంక్రమిస్తాయని తెలిపారు. ప్రతి ఏటా 7 లక్షలకు పైగా మరణాలకు ఈ వ్యాధులు కారణమవుతున్నాయని తెలియజేశారు. డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తున్నందున ఇట్టి దోమల ఉధృతిని తగ్గించుటకు ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంట్లో వెలువడిన చెత్తను రోడ్లపై పడవేయకుండా స్వచ్ఛ ఆటోలకి అందివ్వాలని కోరారు. ప్రతి ఇంటికి డోర్ మెషను ఏర్పాటు చేసుకోవాలని, సాధ్యమైనంతవరకు వదులుగా ఉండే దుస్తులను ధరించాలని తెలియజేశారు. అవగాహన ర్యాలీ సందర్భంగా దేవేందర్ నగర్, మల్లికార్జున నగర్ కాలనీలలో దోమల నివారణ మందులు స్ప్రే చేయించడం జరిగిందని షెడ్యూల్ ప్రకారం ఫాగింగ్, చెరువుల్లో, నీటి నిల్వ ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయడం ప్రతి ఇంటికి స్ప్రే చేయడం వంటి కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయన్నారు. ప్రజలందరూ ఇళ్లలో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్త పడాలని వారంలో ఒకరోజు డ్రై డే గా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ తో పాటు ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ ఏ చైతన్యకుమార్, డి ఈ జాహ్నవి శశాంక్, ఏ ఈ మహేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు నరేష్ రెడ్డి, రాంబాబు, సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతను పెంపొందించడానికి మరియు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడినవి.ఈ తనిఖీలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఎస్సై రమేష ఆధ్వర్యంలో ముఖ్యమైన రహదారులు, జంక్షన్లు మరియు రద్దీ ప్రాంతాలలో తనిఖీలను నిర్వహించి మద్యం సేవించి వాహనం నడుపుతున్న పలువురిని గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడినవి.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో బ్రీత్ అనలైజర్ పరికరాల సహాయంతో డ్రైవర్లను పరీక్షించడం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి, అవసరమైన చోట వాహనాలను సీజ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజలకు సూచించినది ఏమనగా, మద్యం సేవించిన తరువాత వాహనాలు నడపకూడదని, ఇది ప్రమాదాలకు దారి తీస్తుందని, తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## సింగరాజుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రైతులంతా వినియోగించుకోవాలి సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి**



**దేవరుప్పుల, విశాలభారతి:** రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సర్పంచ్ కొండ ఊర్మిళా మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సింగరాజు పల్లి గ్రామంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద ఏర్పాటుచేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ చైర్మన్ నల్ల అండలు శ్రీరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు పొందాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోగు అనిల్ వార్డు సభ్యులు కొండ అఖిల్, రాపాక యాదగిరి, నల్ల యాదగిరి, ఊట్ల శివ, కొండ చిన్న మల్లారెడ్డి, కొండ చిన్న బుచ్చిరెడ్డి, కత్తుల సోమిరెడ్డి, కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, రచ్చ సోమయ్య, జాటోత్ నరసింహ మరియు రైతులు గ్రామస్తులు హమాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమాన

**ఆర్మూర్ ,విశాలభారతి:** ఆర్మూర్ టౌన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన నలుగురు వ్యక్తులను శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ముగ్గురికి ఒక్కొక్కరికి పదివేల చొప్పున మొత్తం 30 వేల రూపాయలను జరిమానా విధించిన ట్లుఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. జే ఎఫ్ సి ఎం మెజిస్ట్రేట్ సరళ రాణి ముందు హాజరు పరచగా నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. వాహనదారులు తమ వాహనాలను మద్యం సేవించి వాహనాలు నడపరాదు, వాహనదారులకు మోటార్ వెహికల్ నూతన చట్టం ప్రకారం జరిమానాలు జైలు శిక్ష పెంచింది. వాహనదారులు తమ యొక్క వాహనాల ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలని ఎస్ హెచ్ ఓ కోరారు.

## ముందస్తు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి




**ఆర్మూర్ ,విశాలభారతి:** నందిపేట్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.మహాత్మా జ్యోతిరావు పూలే మహారాష్ట్రకు చెందిన గొప్ప సంఘ సంస్కర్త, మహిళా విద్య మరియు కుల వ్యతిరేక ఉద్యమాల మార్గదర్శకుడు.మహిళా విద్య, అంటరానితనం రూపు మాపడానికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. మరియు భారతదేశానికి నిజమైన గురువు జ్యోతిరావ్ పూలే. ఈయన వేసిన బాటే నేటి మహిళల ప్రగతికి పూదోట అయింది అని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పివో లక్ష్మణ్ శాస్త్రి, ఏవో తులసి రామ్,విభాగాధిపతులు కిషోర్, లావణ్య, రమాదేవి, త్రివేణి, లీన, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బొంగులూరులో బీఆర్ఎస్ శక్తి ప్రదర్శన



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల పరిధి బొంగులూరు సమీపంలోని ప్రమిద గార్డెన్లో నిర్వహించనున్న బీఆర్ఎస్ విజయోత్సవ సభకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారని మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే కార్యకర్తల సమావేశానికి సబితా ఇంద్రారెడ్డి, కామా మల్లేష్, రమణారెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అంతర్ రాష్ట్ర గంజాయి రవాణా నిందితుల అరెస్ట్

- నలుగురు నిందితులను పట్టుకున్న రామగుండం పోలీసులు
- 20 కిలోల గంజాయి స్వాధీనం
  03 సెల్ ఫోన్ లు స్వాధీనం



**విశాలభారతి, రామగుండం:**

పోలీస్ స్టేషన్ ఆవరణలో పెద్దపెల్లి డిసిపి గోదావరి ఖని ఏసీపీ రమేష్ తో కలిసి పత్రిక సమావేశం ఏర్పాటు చేసి అంతర్రాష్ట్ర గంజాయి రవాణా నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు.శుక్రవారం రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్ నగర్ వద్ద రామగుండం ఎస్ ఐ సంధ్య రాణి సిబ్బంది తో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రామగుండం రైల్వే స్టేషన్ నుండి అనుమానాస్పదంగా బ్యాగులతో కనిపించిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారి వివరాలు అడగగా సరైన సమాధానం చెప్పక పోవడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా బ్యాగ్ లలోని 20కిలోల డ్రై గంజాయి గుర్తించడం జరిగింది వెంటనే వారిని అదుపులోకి తీసుకోని అనంతరం అతన్ని విచారించగ ఒరిస్సా రైల్వే స్టేషన్ లో గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర కొనుగోలు చేసినాము అని వారి పేర్లు విపిన్ కుమార్, దీపక్, వికాస్ కుమార్, మైనర్ అని తెలిపి వారి వద్ద కూడా గంజాయి ఉన్నదని తెలపగ అందరి వద్ద నుండి 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితులు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదగించాలనే దురుదేశ్యంతో అమ్ముతామని తెలపడం జరిగింది. అనంతరం పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేయడం జరిగింది అని డీసీపీ తెలిపారు.ఉత్తర ప్రదేశ్ ని కి చెందిన విపిన్ కుమార్, దీపక్, వికాస్ కుమార్, మైనర్ బాలుడు కూలి పని చేస్తూ వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోక గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణా కు పాల్పడుతున్నారు. ఒరిస్సా రైల్వే స్టేషన్లో గుర్తుతెలియని వ్యక్తి దగ్గర వద్ద గంజాయి కొనుగోలు చేసి కేరళ ఎక్స్ప్రెస్ లో ఫరీదాబాద్ కి వెళుతున్న సమయం లో రైల్వే పోలీస్ వారు ట్రైన్ లో తనిఖీ లు నిర్వహిస్తున్నారని దొరికిపోతామని భయంతో రామగుండం రైల్వేస్టేషన్లో దిగి అక్బర్ నగర్ బోర్డు ప్రాంతం లో తిరుగుతుండగా అదే సమయంలో రామగుండం ఎస్ఐ సంధ్యారాణి అక్బర్ నగర్ బోర్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానస్పదంగా నలుగురు వ్యక్తులు బ్యాగులతో కనిపించడంతో వారిని ఆపి వివరాలు అడగగా సరైన సమాధానం చెప్పకపోవడంతో వారిని తనిఖీలు చేయగా వారి బ్యాగులలో గంజాయి ప్యాకెట్లు లభించడం జరిగింది. వెంటనే వారిని అదుపులకు తీసుకుని పోలీస్ స్టేషన్ తరలించి విచారించి కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని డీసీపీ తెలిపారు.డీసీపీ మాట్లాడుతూ...గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.గంజాయి వినియోగం ఆరోగ్యానికి హానికరమేకాకుండా కుటుంబాల్ని, సమాజాన్ని దెబ్బతీస్తుందని పేర్కొంటూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా గంజాయి అక్రమ రవాణా లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టాలి

**తరుగు పేరుతో రైతులకు తీవ్ర అన్యాయం.. ఆర్డీవోకు వినతి పత్రం అందజేత**



**కోదాడ, విశాలభారతి:** ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటిని వెంటనే అరికట్టాలని కోదాడ నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీల, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ ను కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు 70 కిలోల బస్తాకు కిలో తరుగు పేరుతో, టన్నుకు 5 కిలోల చొప్పున నికర బరువులో తగ్గిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రైవేటు వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు బస్తాకు రెండున్నర కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎంటీ, చింట్లు వంటి సన్న రకాలను మద్దతు ధర కంటే రూ. 200 నుండి 300 తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, దీనిపై మిల్లర్లు, వ్యాపారులతో తక్షణమే సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను నివారించి రైతులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం రోజున రైతులు, కమిషన్ ఏజెంట్లు, ధాన్యం వ్యాపారుస్తులతో సమావేశం ఏర్పాటు చేస్తానని ఆర్డీవో సూర్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బొల్లు ప్రసాద్, కనగాల నారాయణ, దొడ్డ వెంకటయ్య, మెదరమెట్ల వెంకటేశ్వరరావు, ముత్యాలు, నరసింహారావు, రైతులు కమతం రాజేశ్వరరావు, వీరేపల్లి కృష్ణమూర్తి, బొమ్మ కంటి వీరబాబు, బైరాబోయిన వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యులు బాధ్యతగా పనిచేయాలి

**ఎంపీడీఓ ఇస్సాక్ హుస్సేన్**



**కోదాడ, విశాలభారతి:** గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీయాలంటే వార్డు సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోదాడ ఎంపీడీఓ ఇస్సాక్ హుస్సేన్ అన్నారు. మండల పరిధిలోని ద్వారకుంట, నల్లబండగూడెం, అడ్లూరు, గుడిబండ, కాపుగల్లు, గణపవరం, తొగర్రాయి గ్రామాల వార్డు మెంబర్లకు అల్వాలపురం రైతు వేదికలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన పంచాయతీరాజ్ చట్టంపై ప్రతి ప్రతినిధికి తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఆయన సూచించారు. గ్రామ సభల నిర్వహణ, నిధుల వినియోగం, పారిశుధ్యం మరియు మౌలిక వసతుల కల్పనలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.పి.ఓ పార్థసారథి, ఎం.పి.ఓ రాంబాబు, కోలా వెంకటనారాయణ, పొనుగోటి అక్షయ తేజ, రణబోతు మల్లారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మగడ్డ తండాలో పోషణ పక్వాడ కార్యక్రమం



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం దర్మగడ్డతండా గ్రామంలోని గ్రామపంచాయతీ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి అంటే చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదని సూచించారు. ప్రసవం అనంతరం వీలైనంత త్వరగా తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరం అని తెలిపారు. ముఖ్యంగా పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల శిశువుకు రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని, తెలిపారు. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు ఇవ్వాలని అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే వచ్చే పాలను ముర్రు పాలు (కొలస్ట్రం) అని పిలుస్తారని అవి పసుపు రంగులో ఉండి శిశువుకు సహజ ఔషధంగా పనిచేస్తాయని వివరించారు. మేధాశక్తి శారీరక దృఢత్వం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అందుకే వీలైనంత తొందరగా తల్లి పాలు ఇవ్వడం అత్యంత మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు అంగన్వాడీ ఉపాధ్యాయులు ఎన్.స్వరూపరాణి, డి.సుజాత,ఆయా నాగమణి పాఠశాల ఉపాధ్యాయులు డి.శౌరీల్లు, విఓలు, గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మృతదేహం ఉస్మానియా మార్చురీకి తరలింపు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ విషయాన్ని ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్ వెల్లడిస్తూ, శుక్రవారం (10042026) సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో హయత్‌నగర్ బస్టాండ్ ఎదురుగా గల గాంధీ బొమ్మ గల్లీలో సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని తెలిపారు. ఈ ఘటనపై శ్రీకాంత్ అనే వ్యక్తి 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు ఆనవాళ్లు లభించలేదని, అతను భిక్షాటన చేసే వ్యక్తిలా కనిపిస్తున్నాడని వివరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్ తెలిపారు.

ఉలిదెబ్బ తగిలి
రాయికి వచ్చింది రూపం
రూపం లేని రాయి
అయింది శిల్పం
చెక్కిన శిల్పాని
మొక్కింది విశ్వం
రకరకాల రూపంలో
రాయిఅయింది దైవం
రాయిరాత మార్చిన
ఉలిఊసు లేదు
శిల్పంకి రూపం ఇచ్చిన
శిల్పి మాటలేదు
కాలాలు మారినా నీ పై
చెక్కిన ఆకారం మారునా
ఆ కళాఖాండమే చూచి
కనుపాప మరులునా
ఉలిమొక్కిలోయింది
నువ్వురూపు దాల్చంగా
శిల్పిపల్చనయుండు
నినుఅందంగా చూపగా
రచన:-జిల్లేపల్లి ఉపేందర్



## ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**కోదాడ, విశాలభారతి:**

అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్) కోదాడ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, టిఎస్ ఆర్ జెసి కోచింగ్ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెస్ కళాశాలలో శుక్రవారం ఆస్క్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆస్క్ అధ్యక్షురాలు బల్గారి స్నేహ దుర్గయ్య, ఎమ్మెస్ కళాశాలల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, 20 వ వార్డ్ కౌన్సిలర్ జిల్లపల్లి నాగేశ్వరావు,34 వ గంధం బాలేంద్ర పాండు లు పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆస్క్ అధ్యక్షురాలు స్నేహ దుర్గయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆస్క్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పాలిటెక్ ని 14042026 న ఎమ్మెస్ కళాశాల,కోదాడ లో ఉచిత పాలిటెక్నిక్ టి ఎస్ ఆర్ జె సి కోచింగ్ ప్రారంభించబడుతుంది. కావున ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ప్రతి సంవత్సరం సబ్జెక్టులో మంచి ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయ బృందంచే ఉచితంగా శిక్షణ అందించబడుతుందని తెలిపారు. కార్పొరేటు కోచింగ్ సెంటర్లను నమ్మి వేలకు వేలు డబ్బులు వృధా చేసుకోకుండా ఈ ఉచిత పాలిటెక్నిక్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్క్ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్ రావు, జడ్పీహెచ్ఎస్ బేతవోలు జిహెచ్ఎం మాగి గురవయ్య, కోర్స్ డైరెక్టర్య లమర్తి శౌరి, కోర్సు కోఆర్డినేటర్ గంధం బుచ్చరావు, కుడుముల స్వామి దాసు, నందిపాటి సైదులు, అమరబోయిన వెంకటరత్నం, బొడ్డు హుస్సేన్, చేకూరి రమేష్, ఇరుగు కిరణ్ కుమార్, మేళ్లచెరువు వీరభద్రం, షరీఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9666763660ను సంప్రదించగలరు.

## కుంట్లూరులో 'హైడ్రా' యాక్షన్

**కబ్జాదారుల గుండెల్లో రైళ్లు**
**ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

అక్రమ కట్టడాల విషయంలో ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి గజం కూడా వదిలిపెట్టబోమని హెచ్చరిస్తున్న 'హైడ్రా' అధికారులు తాజాగా హయత్ నగర్ పరిధిలో తమ ప్రతాపం చూపారు. కుంట్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 204లో వెలిసిన అక్రమ నిర్మాణాలను జేసీబీలతో నేలమట్టం చేశారు. కుంట్లూరు పరిధిలోని సర్వే నంబర్ 204లో సుమారు 5 ఎకరాల భూమి ఉంది. ఇది 1991లోనే ప్లాట్లుగా మారింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా కొందరు రియల్టర్లు అక్కడ ఉండాల్సిన రోడ్లను సైతం ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన హైడ్రా బృందం, భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు ప్రారంభించింది. కూల్చివేతల సమయంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్లాట్ల యజమానులు, వెంచర్ నిర్వాహకులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.మా సొంత స్థలంలో అనుమతులతోనే కడుతుంటే ఎలా కూల్చుతారంటూ అధికారులతో యజమానులు గొడవకు దిగారు. తమ స్థలాల్లో ఉన్న నిర్మాణాలను అక్రమంగా కూల్చేశారని, దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తామని వెంచర్ యజమానులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే అధికారులు మాత్రం వెనక్కి తగ్గలేదు. "రోడ్ల ఆక్రమణలను సహించేది లేదని, నిబంధనల ప్రకారమే ఈ చర్యలు చేపట్టినట్లు" ప్రాథమికంగా తెలిపారు. ప్లాట్లు కొనేవారు అన్నీ పరిశీలించుకోవాలని, లేదంటే ఇలాంటి నష్టాలు తప్పవని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది. నగర శివార్లలో హైడ్రా దూకుడు చూస్తుంటే, రానున్న రోజుల్లో మరిన్ని అక్రమ నిర్మాణాలు నేలమట్టం కావడం ఖాయంగా కనిపిస్తోంది. హైడ్రా ఈ ఈ అర్చన, ఇరిగేషన్ డి ఈ ఆంజనేయులు, జిహెచ్ఎంసి ఈ ఈ నాగేందర్ కుమార్, డి ఈ సుమంత్ తోపాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు,వివిధ అసియేషన్స్, సహకారంతో చలివేంద్రాలు

**విశాలభారతి , గోదావరిఖని:**

స్వచ్ఛంద సంస్థలు,వివిధ అసియేషన్స్, సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ అన్నారు. వార్డు అధికారులతో శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎవరూ ముందుకు రాని చోట నగర పాలక సంస్థ ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేద్దామని అన్నారు. చలివేంద్రం అవసరమున్న ప్రాంతాలను గుర్తించి జాబితా ఇవ్వాలని కోరారు. కాగా ఏప్రిల్ 30 లోపు చెల్లించిన వారికి అస్తిపన్నుపై ఐదు శాతం రాయితీకి విస్తృత ప్రచారం కల్పించి వసూళ్లు పెంచాలని అన్నారు. .మొక్కలు నాటడానికి అనువైన ప్రాంతాల జాబితా ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ పథకం లబ్దిదారులను చైతన్య పరిచి త్వరితగతిన ఇళ్ల నిర్మాణం ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. స్థలాలు కేటాయించిఉన్న వారిని ఎల్ 2 నుండి ఎల్ 1 కేటగిరీలో చేర్చాలని అన్నారు.జన గణన హెచ్ ఎల్ బి పూర్తి చేయాలని అన్నారు.అమృతం యాప్ లో నల్లా కనెక్షన్ వివరాలు అప్ లోడ్ చేయాలని అన్నారు. శానిటేషన్ సిబ్బంది హాజరు పర్యవేక్షించాలని అన్నారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ ఇ గురువీర, ఇ ఇ రామన్, అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వర్లు, ఎ సి పి శ్రీహరి ,వార్డు అధికారులు, పాల్గొన్నారు.




## జాగృతి పార్టీలోకి పలువురు చేరికలు

**మొయినాబాద్ చిలుకూరులో కార్యక్రమం.. భవిష్యత్ జాగృతిదేనని శివశంకర్**



**మొయినాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర జాగృతి రంగారెడ్డి జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు కుమ్మరి శివశంకర్ ఆధ్వర్యంలో మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో పలువురు జాగృతి పార్టీలో చేరారు .ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం, ప్రజలకు సేవ చేయడమే జాగృతి పార్టీ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తు జాగృతి పార్టీకేనని, అందరూ ఐక్యంగా ముందుకు వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చని అన్నారు. ప్రజలు జాగృతి పార్టీకి మద్దతుగా నిలిచి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల అధ్యక్షుడు సంగేరి నగేష్, మల్లేష్, అంజయ్య, వెంకటేష్ గౌడ్, పరమేష్ గౌడ్, రవి చారి, నాగరాజ్ చారి, గణేష్ యాదవ్, మాధవ రెడ్డి, గౌరవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అవిశిపేట ఆంజనేయులు గౌడ్

**ప్రజాసేవలో మరింత కృషి చేస్తానని హామీ**



**మొయినాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడిగా చిన్నమంగళారం గ్రామ ఉపసర్పంచ్ అవిశిపేట ఆంజనేయులు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అల్లం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆంజనేయులు గౌడ్ గత పదేళ్లుగా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రానికి ఇలాంటి ప్రజాసేవకులు అవసరమని, ఆయన ఈ పదవికి న్యాయం చేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు.నూతన రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఉపసర్పంచ్‌లకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలమణి రాములు, వార్డు సభ్యులు రమేష్, నిర్మల, మహిపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, బిక్షపతి గౌడ్, వెంకటేష్ గౌడ్, శివశంకర్, గ్రామ యువకులు సురేష్, వెంకటేష్, ప్రసాద్, కిరణ్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జపాలలో కుటుంబంతో ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కిన రైతు

**భూ వివాదంపై నిరసన.. పోలీసుల చొరవతో సురక్షితంగా దిగిన కుటుంబం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల పరిధిలోని జపాలలో ఓ రైతు కుటుంబంతో కలిసి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం, వనభూ సమస్యపై అధికారులు, సంబంధిత వ్యక్తులు న్యాయం చేయడం లేదని ఆవేదనతో రైతు తన భార్య, కొడుకు, కూతురుతో కలిసి ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను నచ్చజెప్పి సురక్షితంగా క్రిందికి దింపారు. ఘటనపై స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## అరైవ్ అలైవ్ వీక్' కార్యక్రమం విజయవంతం చేద్దాం: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**విశాలభారతి,మెదక్ :** రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న "అరైవ్ అలైవ్ వీక్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని ఎస్పీ తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలు చురుకుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన 8-9 మంది సభ్యులతో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. రిటైర్డ్ టీచర్లు, వైద్యులు, ఆశా/అంగన్‌వాడీ సిబ్బంది, యువజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులను సభ్యులుగా చేర్చి, కనీసం ముగ్గురు మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. రోడ్డు భద్రతపై ప్రమాణ స్వీకారం నిర్వహించి, గుంతలు పూడ్చడం, ఓపెన్ వెల్స్ మూసివేయడం, పొదలు తొలగించడం వంటి చర్యలు చేపడతారు. అవగాహన కోసం వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయనున్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే జంక్షన్లను గుర్తించి జీబ్రా క్రాసింగ్‌లు, లేన్ మార్కింగ్‌లు పునరుద్ధరిస్తారు. బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, వార్నింగ్ బోర్డులు, లైటింగ్ మెరుగుదల చేపడతారు. విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, సురక్షిత రోడ్డు దాటే విధానంపై ప్రదర్శనలు నిర్వహిస్తారు. స్కూల్ ప్రాంగణాల్లో వార్నింగ్ బోర్డులు ఏర్పాటు చేసి హ్యూమన్ చైన్ కార్యక్రమాలు చేపడతారు. పిల్లల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. సోషల్ మీడియా ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేపడతారు. డ్రైవర్ల లైసెన్సులు, వాహన పత్రాలు తనిఖీ చేసి ఆటో రిక్షాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తారు. ఓవర్లోడింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటారు.రోడ్డు ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందనపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. పోలీస్, అంబులెన్స్ సిబ్బంది, వాలంటీర్లకు ఫస్ట్ ఎయిడ్, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు జరిమానాల బదులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. స్కూల్ బస్సుల భద్రత తనిఖీలు చేసి, స్కూల్ జోన్‌లలో జీబ్రా క్రాసింగ్‌లు, సూచికలు ఏర్పాటు చేస్తారు. "స్లో డౌన్ - స్కూల్ జోన్" వంటి హెచ్చరికల ద్వారా విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.




# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.